

# ఖాదర్ లేడు

మహమ్మద్ ఖదీర్‌బాబు

"ఖాదరా? లేడు. నిన్న కనిపించాడు. ఆ తర్వాత ఎటుపోయాడో ఎవణ్ణి ఎవడు పట్టించుకుంటాడు. ఎవడిది వాడు గీరుకోవడమే సరిపాయె," అన్నాడు పరోటా షేర్వా అమ్ముకునే పాఛులు.

"ఇంకెక్కడి ఖాదరు నాయనా. ఆరోజే పాయనే," అంది పక్కింటి ముసలామె.

ఖాదర్‌ని వెతుక్కుంటున్న బైసాని వెంకట సుబ్బయ్యకి ఏంచేయాలో తోచలేదు. శుక్ర, శని, ఆది, సోమ... ఈ నాలుగు రోజులూ జరిగిన కూలగొట్టడాల్లో ఆదివారం ఒక్కరోజే అతడు బజారులో లేడు. కానీ ఆ ఒక్కరోజులోనే చాలా కథ జరిగిపోయింది.

అది జరిగాక, ఆ మరుసటిరోజు ఉదయం బైసాని వెంకటసుబ్బయ్య...

"కాపీ కాపీ... కాపీ తాగేసిపో," అంది బైసాని వెంకటసుబ్బయ్య భార్య.

"తాళాలు... నిన్నే," అంది స్కూటరు తాళాలను చేతిలోకి తీసుకుంటూ.

బైసాని రెండూ అందుకోలేదు. టీవీ సెట్టు మీదున్న అంగడి తాళాలు మాత్రం తీసుకొని యింట్లో నుంచి బయటపడ్డాడు.

అతడు వడివడిగా నడవాలనుకుంటున్నాడుగానీ అడుగులు మందకొడిగా పడుతున్నాయి. ఉండుండి తల తిరుగుతున్నట్టుగా అనిపిస్తోంది. ఆ ముందు రోజంతా అతడి ఒంటిమీద స్పృహ లేదు. కాంపోజ్ బిళ్లలేసుకొని మంచం దిగకుండా పడుకొని ఉన్నాడు. మధ్యమధ్యలో భార్య లేపడం, బలవంతాన పాలో మజ్జిగో తాగించడం, బంధువులొచ్చి పరామర్శించడం లీలగా గుర్తున్నాయి. పిలకాయలు టీవీ ప్రోగ్రాములు పెట్టినప్పుడు మాత్రం మెలకువ వచ్చి గట్టిగా కసరడం జ్ఞాపకం ఉంది.

అంతకుముందు రెండురోజులు- అంటే శుక్ర, శనివారాలప్పుడు కూడా ఏం చేశాడన్నది అతడికి గుర్తుకురావడం లేదు. ఏ పని ముందు చేశాడో ఏ పని తర్వాత చేశాడో అతడి ఎరుకలో లేకుండాపోయింది.

అందరూ అనుకున్నట్టే బైసాని కూడా మనదాకా రాదులే మనదాకా రాదులే అనుకుంటూ వచ్చాడు. కానీ మనదాకా వస్తుందని తెలిపోయాక ఠారెత్తిపోయి అతడు తీసిన పరుగు అంతా యింతా కాదు. మొదట రెడ్డిని కలిశాడు. పోలీసులకు చెప్పించాడు. అనేక మునిసిపాలిటీ వాళ్లను కలిశాడు. అడ్డం పడమన్నాడు. ఆ తర్వాత ఎవర్నో పట్టుకొని హైదరాబాద్‌కు ఫోన్ చేయించాడు. స్పెషలాఫీసరుకు చెప్పించాడు. ఇదంతా కాదు, తలా కొంత వేసుకుంటే ఈ ఉపద్రవం ఆగుతుంది అని నలుగురూ అంటే అంతకంటేనా అని ఉరుకులు పరుగుల మీద వెళ్లాడు. వాటా తెచ్చిచ్చాడు.

అంతా వృథా అయ్యింది.

శనివారంనాడు, అంటే కూలగొట్టడాలు మొదలైన రెండోరోజున సరిగ్గా రాత్రి పదకొండు గంటలప్పుడు దడదడలాడే శబ్దాలతో కరకరలాడే పళ్లతో ప్రొక్లయినర్ వచ్చి అందరి అంగళ్లను కూల్చినట్టే బైసాని వెంకట సుబ్బయ్య అంగడిని కూడా కూలగొట్టింది.

ఆరోజు, అంత రాత్రప్పుడు- ఫోకస్ లైట్ల వెలుగులో ఆ గందరగోళంలో సైతాన్‌లాంటి ప్రొక్లయినర్‌ని వెంటబెట్టుకొని పోలీసోళ్లు, ఆఫీసర్లు, కూలోళ్లు బిలబిలమంటూ చుట్టూ మూగేసరికి అంతటి పెద్దమనిషికి, పలుకుబడి వున్నోడికి, డబ్బున్నోడికి ఎందుకనో ఒంట్లో చల్లగా చమట పట్టింది. ముందుగా గీసిపెట్టిన గీత

ప్రకారం షాపు మూడడుగుల దాకా లేచి పోతుందని అనుకున్నాడుగానీ ఆ లెక్క బూమికేగాక ఆకాశానికి కూడా వర్తిస్తుందని తెలిశాక అదిరిపోయాడతడు. అదే గనుక జరిగితే రాబోయే నష్టం అంతా యింతా కాదు. చాలా ఏళ్ల క్రిందటే కింద షాపు మీద ఇంకో షాపు కట్టి గోడౌనుగా చేసుకున్నాడు దాన్ని. గవుర్నమెంటు లెక్క ప్రకారం చూసినా ఒక్కడుగే ముందుకొచ్చుందది. ఒక్కడుగే కదా ఒదలకపోతారా అని ఆశపడ్డాడుగానీ ఒక్కడుగైనా ఒక్కంగుళమైనా కిందదానితో పాటు పై దానిని కూడా కూల్చక తప్పదని ఆఫీసర్లు చెప్పినప్పుడు అతడికి నాలుక ముద్ద కట్టినట్టుగా అనిపించింది. కాసేపు తాలితే వాంతొచ్చి గుండెపోటు వస్తుందని బయ మేసింది. శ్లాబులు, షట్టర్లు, గోడలు, సీలింగు అన్నీ క్షణాల్లో ముక్కలు చెక్కలవుతుంటే- యింకక్కడ ఉండ లేక కళ్లతో చూడలేక సొంత తమ్ముడికీ గుమాస్తాలకీ అంగడి అప్పజెప్పి యింటికొచ్చి ముసుగు తన్నేశాడు.

అతడికి ఏడుపొచ్చిందిగానీ కంట్లో చుక్కనీరు పుట్టలేదు. దుక్కమొచ్చిందిగానీ గొంతు పెగల్లేదు.

ఎన్నాళ్లనుంచి ఉన్న షాపు? ఎన్నేళ్లుగా యాపారం చేస్తున్న షాపు? యిట్లానా కూల్చేది? అదీ ఈ టైము లోనా? ఇంత కొంపలు మునిగిపోయినట్టుగానా? అని గిలగిలలాడిపోయాడు.

నిజంగానే ఈసారి టైము కలిసొచ్చి నాలుగు పండుగలు వచ్చాయి వరుసగా. క్రిస్టమస్సు, రంజాను, జనవరి ఒకటి, సంక్రాంతి. యాపారంలో ఎట్టాంటి దరిద్రుడైనా బాగుపడే కాలం ఇది. ఈ కాలం కోసం అందరు యాపారస్తులు ఎదురుచూసినట్టే బైసాని వెంకటసుబ్బయ్య కూడా ఎదురుచూశాడు. లక్షల రూపాయలు ఎదురుబోసి కొత్త స్టాకు తెప్పించు కున్నాడు. కలరు దీపాలు వేయించి షాపును ముస్తాబు చేయించాడు. అన్నీ రెడీ అయ్యాయి, అంతా సిద్ధంగా ఉంది, యింక రేపో మాపో యాపారం పుంజుకోవడమే తరువాయి అనుకుంటూ ఉండగా నెత్తిమీద గుండంలా ఈ ఉపద్రవం వచ్చిపడింది. ఆపే ఉపాయం లేదు. కోర్టులకెక్కినా ఫలితంలేదు. కూల్చుకోవాలంటే కూల్చు కుందురు, ఈ పండుగలు పోయేంతవరకైనా ఆగండి అయ్యలారా అని నెత్తీనోరు కొట్టుకున్నా ఆఫీసర్లు విన లేదు.

కూలగొట్టేదాకా ఒంటికాలి మీద నిలబడ్డారు. కూలగొట్టారు.

ఈ పని యింత త్వరగా, యింత అర్జెంటుగా, యింత దయలేకుండా చేయమని ఎవరు చెప్పారో, ఎందుకు చెప్పారో ఎవరి మేలుకోరి చెప్పారో ఆ యాపా రస్తుడి బుర్రకి తోచలేదు.

సరే, పోతేపోయింది, పీడాపోయింది, ఇదిగో కూలుస్తాం అదిగో కూలుస్తాం అని తడవకోసారి ఫైళ్లు పట్టుకొనొచ్చి బెదిరిస్తూ ఉంటే బితుకుబితుకు మంటూ బతికేరోజులు ఇంతటితో అన్నాపోతే బాగుండు అనుకున్నాడతడు. ఆకులు పారేశాక తిరిగి మెతుకుల కోసం కలిబెట్టకుండా ఇంతటితో వగదెగిచ్చి ఒకరికొకరు కూడదీసుకుంటే చాలుననిపించింది.

అందుకనే, ఇవాళ కూడా షాపు ముఖం చూడా లని లేకపోయినా అతడు బయటికి వచ్చాడు. ఎవ రెవరు ఎంతెంతకు నష్టపోయారో ఎవరెవరు ఎంతెంతకు మునిగిపోయారో తెలుసుకుంటే ఒక ధైర్యం కదా అనుకున్నాడు.

ఆ ఆలోచన వచ్చాక అడుగుల వేగాన్ని యింకాస్త పెంచి పోలేరమ్మ బండ దాటుకొని విష్ణాలయం వీధి లోకి వచ్చాడు బైసాని.

ఆ వీధిలో నుంచి నేరుగా పోతే ట్రంకురోడ్డు.

కానీ నాలుగడుగులు వేసేసరికే అతడి గుండె జల్లుమంది. దూరంగా గుంపులు గుంపులుగా మనుషులు కనబడుతున్నారు. ఆడోళ్లు, పిలకాయలు పొలోమని పరిగెడుతున్నారు. ప్రొక్లయినరు రొద వినిపిస్తూ ఉంది. ఆ చివర నుంచి రేగుతున్న దుమ్ము విష్ణాలయం గోపురాన్ని కమ్ముకుంటూ ఉంది.

ఆ దుమ్ము చూసి, ఆ రొద విని, ఏం జరుగు తున్నదో అర్థం చేసుకున్నాక నోరు వెళ్లబెట్టి ఏమిరా ఈ నా కొడుకులు అనుకున్నాడతడు.

ట్రంకురోడ్డు మీదంటే రోడ్డు వెడల్పు చేయాలనీ, డబుల్ రోడ్డు వేయాలనీ, పై నుంచి ఆర్డర్లు వచ్చాయనీ దొరికిన అంగడిని దొరికినట్టుగా లేపవతల పారేస్తే ఏమోలే అయ్యుండొచ్చులే అనుకున్నాడుగానీ ట్రంకు రోడ్డుతో ఏమాత్రం సంబంధంలేని విష్ణాలయం వీధి అంగళ్లను కూడా ఎందుకు కూల్చేస్తున్నట్టు అని గబగబా అక్కడకు చేరుకొని తొంగిచూశాడు.

అప్పటికే దూరెంకయ్య అంగడి, స్వామి హోటలు సగానికి కూలిపోయి ఉన్నాయి. మియాజాను అంగడి ముందున్న అరుగును పిండి పిండి చేసి వదిలారు. దానిపక్కనే ఉన్న ధర్మకాటా అంగడిని ప్రొక్లయినరు ఒడిసిపట్టేసరికి ఏనాటి అంగడో దబదబమని మొత్తం కూలిపోయిందది. కొందరు యాపారస్తులు, వాళ్ల గుమాస్తాలు షాపుల్లో ఉన్న సరుకుల్ని గబగబా బయట పడేసుకుంటున్నారు. ఇంకొందరు చేష్టలు మాని అట్టే నిలుచుని ఉన్నారు.

యింక అక్కణ్ణుంచి ముందుకుపోలేకపోయాడు బైసాని. ఆ వీధిలో ఉన్నవన్నీ బంగారు అంగళ్లు. వాటిలో సగం సాయెబులవి. తక్కినవి శెట్టిగార్లవి. అంటే అతడి

సొంత కులస్తులవి. వాళ్లంతా అతడికి కొద్దోగొప్పో బంధువులు, పరిచయస్తులు. ఇట్టాంటి టైములో వాళ్ల ముఖం చూడడానికి మనసొప్పలేదు.

అడ్డరోడ్డులో వరవకట్ట ఎక్కి ట్రంకురోడ్డులోకి వెళ్లిపోదామా అనుకుంటూ వుండగా అతడి కాళ్ల ముందుకు సర్రున ఒక రిక్షా వచ్చి ఆగింది.

దాన్లోంచి ఊపిరి ముక్కున బిగబెట్టుకుని ఒక ముసలావిడ దిగింది. ఆమె ఎగశ్వాసతో ఉంది. మూలుగుతోంది. ఏడుస్తూ ఉంది. ఆ రిక్షా వెనుకనే సైకిలు మీద వచ్చిన అమీరుజాను గబాల్న వెళ్లి ఆమెను జవురుకున్నాడు పడిపోకుండా.

"యిదేమి పీడరా నాయనా. యిదేమి గజబురా తండ్రి. తాతల తండ్రుల కాలంనాటి సొత్తుని ఎట్ట కూల గొడ్తున్నార్రా నాయనా. యింక నువ్వెట్ట బతకపోతావురా దేవుడా... వీళ్లని ఏడేడు మట్ల లోతున కప్పెట్ట. వీళ్ల పాడెల్ని కుక్కలు ఎంగిలి చెయ్య. వీళ్ల సమాధుల్లో అపరాత్రుళ్లు పొగలెయ్య..."

ముందుకు ఒంగి మట్టిని ఎగజిమ్ముతూ, కొడుకు చేతుల్లో విరుచుకు పడిపోతూ ముందుకు నడుస్తోందా ముసలామె.

ముప్పయి ఏళ్లుగా ఏనాడూ పరదా చాటు నుంచి బయటికి వచ్చుండని ఆ ముసలామె ఎంతుంటుందో ఎంత పోతుందో తెలియని భర్త జ్ఞాపకాన్ని ఆఖరుసారి చూసుకోవడానికి బయటికి వచ్చింది. పాత నగలకు బంగారు నీరు ఎక్కించి బతికే అమీర్‌జాను మూగోడి లాగా వాళ్లమ్మను కరుచుకొని నడుస్తున్నాడు.

ఇప్పుడో యింకాసేపట్లోనో అతడి అంగడి కూలు తుంది. కానీ అతడు దాన్ని తిరిగి నిలబెట్టుకోవడానికి ఎన్ని రోజులు, ఎన్ని వారాలు, ఎన్ని నెలలు పడుతుందో చెప్పలేము.

"విన్నా. ఎప్పటివో యాభైలవో నలభైలవో రికార్డులు తెచ్చారంట. అప్పటి లెక్కల ప్రకారం ఈ వీధి ఇంత వెడల్పుగా ఉండాలి అని చెప్పి అన్నీ లేపు కుంటూ పోతున్నారు," అంటున్నాడొకడు.

"బాగయ్యిందిలే. మంచిగయ్యిందిలే. లేకుంటే రోడ్లు సందులూ గొందులూ వీళ్లమ్మా మొగుళ్లవిలా ఆక్రమించేసుకున్నారు అందరూ," అంటున్నాడు యింకొకడు.

ఇంకా అక్కడే వుంటే ఏమేమి చూడాలో, ఏమేమి వినాలో అని వరవకట్ట ఎక్కి ట్రంకురోడ్డులోకి వచ్చే శాడు బైసాని.

కావలిటౌను మొత్తానికి ఒకటే రోడ్డు. అది ట్రంకు రోడ్డు. బయటివాళ్లు దాన్ని మద్రాసు కలకత్తా హైవే అనీ, ఐదవ నెంబరు జాతీయ రహదారి అనీ అంటారుగానీ ఊర్లో ఉన్నోళ్లు మాత్రం ట్రంకురోడ్డనే అంటారు. ఊరు బతకడానికి ఆ రోడ్డే ఆదరువు, వెన్నుపూస. దాన్ని చూసు కునే ఎన్నో ఏళ్లుగా ఆపక్కా ఈపక్కా పాకి సందులుగా గొందులుగా పెరిగిపోయిందది. అయినప్పటికీ ఈనా టికి కూడా ఊరోళ్లకి మూర పూలు కావాలన్నా, చిన్న పిన్నీసు కావాలన్నా ట్రంకురోడ్డే గతి. ఇంకో బైపాసు లేదు. యింకో బిజినెసు సెంటరూ లేదు. కూరగాయల మార్కెట్టు, చేపల మార్కెట్టు, బ్యాంకులు, కోర్టులు, ఆస్పత్రి, చిల్లర అంగళ్లు, గుడ్డల కొట్లు, మట్టీ మశానం సర్వం అక్కణ్ణే ఉండేసరికి చిన్నోడైనా పెద్దోడైనా యాపారం చేసుకొని బతకాలంటే దాన్నే పట్టుకొని పెనుగులాడక తప్పని పరిస్థితి.

అట్టాంటి రోడ్డు మీద, జాక్‌పాట్ సెంటర్ మీద, నెల్లూరు వైపు ముఖం పెట్టి నడుస్తుంటే ఎడంవైపున కనిపిస్తుంది బైసాని వెంకటసుబ్బయ్య అంగడి. అతడికి ఇవాళ రెండు సొంత ఇళ్లు, జయకృష్ణా థియేటరు దగ్గర నాలుగుప్లాట్ల స్థలమూ ఉండొచ్చుగాక, ట్రంకురోడ్డు మీద మాత్రం ఆ ఒక్క అంగడే ఉంది. ఇంకొకటి లేదు. కొనాలన్నా దొరకదు. డిమాండు అట్టాంటిది.

బైసానికి ఆ ఒక్క అంగడైనా వాళ్ల నాన్న నుంచి సంక్రమించింది. అతడి చిన్నప్పుడు వాళ్ల నాన్న ఆ షాపులో మోటారుగానుగ ఆడిస్తూ నూనె యాపారం చేసేవాడు. వేరుశనగ నూనె, కొబ్బరి చమురు, నువ్వుల నూనె, ఆముదం... కానీ పొద్దస్తమానం జిడ్డుగా, వికారం గా ఉంచే ఆ యాపారం చేయడం ఇష్టంలేక షాపు తన చేతికి అందివచ్చాక గానుగ తీసిపారేసి తండ్రి పేరు మీద 'బైసాని శేషయ్య అండ్ సన్స్' అని గుడ్డల కొట్టు పెట్టా డతడు. అప్పుడే షాపు రీమోడలింగ్ చేయిస్తూ నాలు గడుగులు ముందుకొచ్చి ఇంకొక షట్టరు దించు కున్నాడు. పైన యింకో షాపు వేసి గోడౌన్ చేసుకున్నాడు.

అప్పట్లో- అంటే యిరవై పాతికేళ్ల క్రితం ఆ పని అందరికీ మామూలు విషయం. తప్పని చెప్పినవాడు గానీ లేపేస్తాం అని బెదిరించిన వాడుగానీ లేడు. పైగా అప్పట్లో ఈ రోడ్డంతా మన్దేకదా అనే సొతంత్రం యాపా రస్తులందరికీ ఉండేది.

కానీ ఇవాళ జరిగింది చూశాక ఆ మాటనే ధైర్యం ఎవరూ చేయలేరు. బైసానైతే ఎప్పటికీ చేయలేడు.

అతడు షాపు దగ్గరికి చేరుకునేసరికి పరిస్థితి భీతావహంగా ఉంది. లోపల పట్టేంత స్టాకు లోపల పెట్టి మిగిలిన దానిమీద టార్పాల్ పట్టలు కప్పి కాపలా కూర్చుని ఉన్నారు గుమాస్తాలు. చుట్టుపక్కల పరిస్థితి కూడా అలాగే ఉంది. కొందరు గోడలు కట్టించుకోవడం మొదలెట్టారు. ఇంకొందరు కూలిపోయిన కాంక్రీటు దిమ్మెల్లోని ఇనుపచువ్వల్ని వెల్డింగు చేయించి తీసే

యించుకుంటున్నారు. మెట్లు లేచిపోయిన యాపా రస్తులందరూ మేదర నిచ్చెనలు తెచ్చుకొని పైనున్న షాపులకు చేరుకుంటున్నారు. కొందరు షాపులు తెరి చారుగానీ యాపారాలు చేయడం లేదు. కొందరసలు షాపులే తెరవలేదు.

నిన్న మొన్నటిదాకా కళకళలాడుతూ కనిపించిన ట్రంకురోడ్డు యివాళ గబ్బగియ్యంగా ఉంది.

బైసాని చేతుల్లోంచి షాపు తాళాలు అందు కుంటూ, "బేల్దారెంకయ్య వచ్చి చాలాసేపయిందనా," అన్నాడు పెద్ద గుమాస్తా.

అంజీ టీ కొట్లో టీ తాగి తాపీగా అడుగులేసు కుంటూ వస్తున్న ఎంకయ్య అల్లంత దూరం నుంచే బైసానిని చూసి నడకలో వేగం పెంచాడు.

"అయా. దండాలయా. మీ తమ్ముడు పంపించా డయా కలవమని," అన్నాడు ఒదిగి.

"చూశావా," అన్నాడు బైసాని.

"చూశానయా. అంతా సత్తెనాశినం. పైనా కిందా కలిపి షాపుని ఒక దోవకి తేవాలంటే ఎట్టలేదన్నా పది రోజులు పడుతుందయా. కానీ..."

"ఏంది?"

"ఏంలేదయా. ఊరు ఊరంతా తుపాను కొట్టి నట్టు కూలిపోయిందిగదయా. బేల్దార్లు కూలోళ్లు యాడి కాడ పనుల్లో చిక్కుబడిపోయున్నారు. పగలు పనికి దొర కడం కష్టం. మీరు ఊ అంటే వాళ్లనే ఎట్లోకట్ల పుసలా యించి రాత్రి పని చేయిస్తా," అన్నాడు వెంకయ్య.

"ఎట్లోకట్ల చెయ్యి," అని జేబులో నుంచి డబ్బు తీసిచ్చి, "ఇటుకా, ఇసుకా తోలించు," అన్నాడు బైసాని.

ఎంకయ్య వెళ్లిపోయాడు.

బైసాని కుర్చీ తెప్పించుకొని బయట వేసుకొని కూర్చొనబోతూ రోడ్డుకు ఆపక్క చూసి ఆగిపోయాడు. తేడాగా అనిపించింది. మళ్లీ చూశాడు. బోసిగా అనిపిం చింది. చూసేకొద్దీ ఏం జరిగిందో అర్థమయ్యాక ఒళ్లు జలదరిస్తూ ఉంటే, "మార్జినోళ్లేర్రా," అన్నాడు పెద్దగా.

"ఇంకెక్కడి మార్జినోళ్లనా..." అన్నాడు పెద్ద గుమాస్తా.

"నిన్న నువ్వు లేవుగదా. కుక్కల్ని తరిమినట్టు తరిమారులే వాళ్లని. గీరుకోవడానికి కూడా టైమివ్వలా. బుల్‌డోజర్లు తెచ్చి తొక్కించేస్తాం కొడకల్లారా అని బెది రించేసరికి చెంబు చేటా తట్టా బుట్టా సర్దుకొని ఎటు వాళ్లటు లగుదోల్. నిన్న జరిగిందానికీ, నిన్న తరిమిన తరుముడికి మళ్లీ జన్మలో ఈపక్క తలతిప్పి చూడరు చూడు వాళ్లు. ఎన్నాళ్లుగా ఈడ బతికిన బతుకు. ఎన్నా ళ్లుగా ఈడ అంటిపెట్టుకున్న తావు. నిమిషాల మీద ఖాళీ చేయించేసారు పాపం..." గుమాస్తా చెబుతూనే ఉన్నాడు. బైసానికి అలసట కమ్ముకొచ్చింది.

కుర్చీలో అట్టే కూలబడిపోయాడు. దేవుడా అనుకున్నాడు తల పట్టుకుంటూ.

"ఖాదరురా. ఖాదరు ఏమయ్యాడు," అన్నాడు మళ్లీ.

సయ్యద్ మీర్ ఖాదర్ మొహియుద్దీన్ అలియాస్ సైకిల్‌షాపు ఖాదరూ, బైసాని వెంకటసుబ్బయ్య ఒక స్తోమతకి చెందినవారు కాదు. ఒక మతానికి, ఒక భాషకీ చెందినవారు కాదు. ఆఖరికి ఒక వయస్సుకు చెందిన వారు కూడా కాదు. అయినా వాళ్లిద్దరి మధ్య స్నేహం ఉంది. బైసాని ప్రయత్నం మీద అది మొదలయ్యి పెన వేసుకుని కొనసాగుతూ ఉంది. ఇదంతా ఒక అద్దె సైకిలు పుణ్యం.

"నీగ్గదా చెప్పేది. పోయి పెద్దోళ్లని పిలచకరాపో. వాళ్లొచ్చి చెప్తేగాని యివ్వను..." ఇవీ బైసానితో ఖాదరు మాట్లాడిన మొదటి మాటలు.

అప్పటికి బైసాని వయసు పన్నెండో పదమూడో. ఖాదరు అతడి కంటే పదేళ్లన్నా పెద్దవాడు. కసరత్తు చేసి నట్టుండే ఒంటితో, దండెం కండల మీద బిగించి కట్టిన తావీజుతో సైకిళ్లకు బుస్సుబుస్సున గాలికొడుతూ పిల కాయలకి చాలా కఠినాత్ముడిలా కనిపించేవాడు. వాళ్లకి అతడితో మాట్లాడాలంటేనే చాలా భయంగా ఉండేది. కానీ మాట్లాడక తప్పేదికాదు.

ఎందుకంటే అప్పట్లో కావలి మొత్తం మీద పిల కాయలు తొక్కే సైకిలు అతడొక్కడి దగ్గరే ఉండేది. అది నీలం రంగు హెర్క్యులస్ సైకిలు. పిలకాయల సైకిలు కావడం వల్లో లేక ఖాదరు అలంకరించడం వల్లోగానీ అది రంగురంగుల సీటుతో, కుచ్చులు కుచ్చులుగా వేలాడే హ్యాండిలు గ్రిప్పులతో, కాలితో నెట్టగానే టక్కునపడే సైడు స్టాండుతో రారా నా సామి రంగా అని పిలుస్తూ ఉండేది. పెద్దోళ్ల సైకిళ్లు ఎన్నున్నా, ఆఫ్ పెడలేసి ఎన్నిసార్లు తొక్కినా సీటుమీద కూర్చుని తొక్కే భాగ్యం కలిగించే అట్టాంటి సైకిల్‌ని తాకని బతుకూ ఒక బతుకేనా అనుకునేవాళ్లు పిలకాయలు.

అట్టాంటి సైకిలు చేతిలో ఉన్నోడు గనుక, పిలకాయల కోసం అట్టాంటి సైకిలు అద్దెకు పెట్టినోడు గనుక ఏ విధంగా చూసినా ఖాదరు మంచి చేసుకోదగ్గ మనిషిగా బైసానికి అనిపించింది. అయితే ఖాదరు మాట వినేరకంగా లేడు. పెద్దోళ్లు చెప్పనిదే సైకిలు ఇచ్చేలా లేడు. డబ్బులివ్వమంటే యివ్వగలడుగానీ పెద్దోళ్లని తెమ్మంటే ఎక్కణ్ణుంచి తెస్తాడు. షాపులో కూచో కుండా సైకిలు తొక్కుకుంటానంటే తోలు వలుస్తాడు వాళ్ల నాన్న.

''నేను బైసాని శేషయ్యోళ్ల పిల్లోడిని. నువ్వు సైకిలిస్తే మా నాయన లేనప్పుడు ఎంత నూనె కావాలన్నా పోస్తా,'' అన్నాడు గుంజనానుకొని.

ఆ మాటలకి ఖాదరుకి నవ్వొచ్చింది. నవ్వలా.

''ఆ మాట మీ నాయనతో చెప్తా పా. ఉతుకుతాడు,'' అన్నాడు బెదిరిస్తూ.

బైసానికి కోపం వచ్చేసింది.

''యోవ్. సైకిలిస్తే యివ్వు. లేకపోతే పో. మేము బైసానోళ్లం. రేపీపాటికి మా నాయనతో చెప్పి మద్రాసు నుంచి కొత్త సైకిలు తెప్పించుకోకపోతే చూడు,'' అన్నాడు కళ్లనీళ్ల పర్యంతమవుతూ.

అది చూసి, చేస్తున్న పని వదిలేసి, ''ఏడవబాక. ఏడవబాక. ఉరే... బైసానోళ్ల అబ్బాయి ఏడ్వవచ్చునా?'' అన్నాడు ఖాదరు నవ్వుతూ, బైసాని భుజాన చెయ్యేసి దగ్గరకు తీసుకుంటూ.

ఆరోజు నుంచి వాళ్లిద్దరికీ స్నేహం. చదువు ఎట్టాగూ లేదు కాబట్టి, చిన్నప్పట్నించి షాపులో కూర్చునేవాడు కాబట్టి సందు దొరికినప్పుడల్లా వచ్చి ఖాదరు షాపులో కూర్చునేవాడు బైసాని. పెద్దపెద్ద సైకిళ్లను కూడా ఖాదరు అవలీలగా మర్లేసి పొర్లేసి రిపేర్లు చేసి పారేస్తుంటే ఆసక్తిగా గమనించడం అతడి పని. అన్నింటికంటే ముఖ్యంగా షాపు మూసేశాక ఖాదరు ఒక సైకిలుని ఒక చేత్తో, యింకో సైకిలుని యింకో చేత్తో బ్యాలన్సు చేస్తూ రెండింటిని ఒకేసారి యింటికి తొక్కుకుని పోతుంటే చూడటం అతడికెంతో యిష్టం.

ఆ సైకిల్ సర్కసు చూసి ఎవరైనా, ''అన్నీ ఇంటికి తీసుకెళ్లి దాపెట్టుకోవాలా. షాపులో పడేస్తే ఉండవా,'' అనంటే ఖాదరుకి ఎంత కోపం వచ్చేదో.

''పోతే నువ్విస్తా,'' అనేవాడు కసురుకుంటూ.

అందుకనే కొత్తవాళ్లెవ్వరికీ అద్దెకిచ్చేవాడు కాదు ఖాదరు. తెలిసినవాడు చెబితే తప్ప అతడి నుంచి సైకిలు తీసుకోవడం యమా కష్టం. ఆ ఏమవుతుందిలే అని ఒకసారి ఒకడెవడికో అద్దెకిస్తే వాడు దాన్ని పక్యూర్లో పాతిక రూపాయల కుదువకు పెట్టేసి ఎటోపోయాడు. దాంతో లబోదిబోమని నోరు కొట్టుకొని విడిపించుకున్నప్పట్నించి యింకాస్త జాగ్రత్తగా ఉండేవాడు ఖాదరు. బైసానికి మాత్రం యీ అడ్డేమీ ఉండేదికాదు. చిన్న సైకిలైనా పెద్ద సైకిలైనా ఎంతసేపు కావాలంటే అంతసేపు అతడి యిష్టానికి యిచ్చేసేవాడు.

అయితే దానికి ప్రతిఫలం అతడికి ఎండాకాలంలో దక్కేది.

తక్కిన కాలాల సంగతి ఎలా ఉన్నా ఎండాకాలంలో ఖాదరే స్వయంగా వచ్చి బైసానోళ్ల అంగడిలో నీడపట్టున కూర్చునేవాడు కాసేపు. అతణ్ణి అల్లంత దూరంలో చూడటంతోటే ఆముదం దబరలో చిట్టీని ముంచి పెట్టేవాడు బైసాని. ఖాదరు రావడం, అరచెయ్యి సాచడం, బైసాని దాని నిండుగా జర్రున ఆముదం పోయడం, ఖాదరు దాన్ని తపాతపామని నెత్తికి పూసుకోవడం జరిగిపోయేవి.

''ఎండలు గదా అబయా. సచ్చిపోతాం బెట్ట తగిలి,'' అనేవాడు చెవుల కిందికి జారుతున్న నూనెని తుడుచుకుంటూ.

ఖాదరుకు పగలు పొద్దస్తం ఎండ తగులుతుందంటే తగలక తప్పదు. అతడిది బైసానోళ్ల షాపులాగా పట్టా ఉన్న షాపు కాదు. పక్కాగా కట్టిన షాపూ కాదు. మార్జిను అంగడి. దీన్నే తడికెల అంగడి అని కూడా అంటారు. ఈపక్క ఒక తడికె, ఆపక్క ఒక తడికె, పైనొక తడికె వేసుకుంటే చాలు మార్జినోళ్లకి అదొక అంగడైపోతుంది. ట్రంకురోడ్డుకి ఈ కొస నుంచి ఆ కొస దాకా రోడ్డు మార్జినులో యాడ రొంత స్థలం దొరికినా యాడ రొంత వీలు దొరికినా బంకు లేసుకొనో, తడికెలు కప్పుకునో దాన్ని ఆదరువు చేసుకుంటారు మార్జినోళ్లు. ఒకసారి తావు సంపాదించుకున్నాక యింక అక్కణ్ణుంచి కదలరు. ఎండొచ్చి ఎండినా వానొచ్చి తడిసినా అక్కడే ఉంటారుగానీ పక్కకు మళ్లరు. మళ్లితే ఇంకొకడు దూరిపోతాడని భయం. జానాబెత్తెడు మార్జిను స్థలం కోసం కొట్లాటలూ, గలాటాలూ జరిగిన సందర్భాలున్నాయి.

అయితే ఖాదరుకు ఆ బయం లేదు. కోర్టు గోడ దగ్గర, గంగరాయి చెట్టు కింద, తడికెలతో కట్టుకున్న ఖాదరు మార్జిను అంగడిని ఎవడూ కన్నెత్తి చూడరు. అది ఖాదరుది. ఏనాటి నుంచో ఖాదరుదే. బైసానికి వాళ్ల నాన్న పక్కాషాపును వారసత్వంగా ఇచ్చినట్టు ఖాదరుకు వాళ్ల నాన్న ఆ మార్జిన్ అంగడిని వారసత్వంగా ఇచ్చేసి పోయాడు. కాకపోతే బైసాని తన హయాంలో రీమోడలింగ్ చేయించుకున్నాడు. ఖాదరు చేయించుకోలేదు. బైసాని కొత్త యాపారం పెట్టాడు. ఖాదరు పెట్టలేదు.

''యోవ్ అబయా, బంగారంలాంటి నా ఆముదం కానూకావు గదయా యాపారం మార్చి,'' అన్నాడు ఖాదరు, గుడ్డలకొట్టు పెట్టడానికని బైసాని షాపు రీమోడలింగ్ చేయిస్తున్నప్పుడు.

''ఆముదానిది ఏముంది ఖాదరన్నా. నీకు కావాలంటే చెప్పు. సిమెంటు ఇసుకా మిగిలేట్టున్నాయి. ఆపు రేటుకి ఇచ్చేస్తా. సింగిల్‌రాయి గోడ కట్టుకొని నీదాన్ని కూడా పక్కా చేసుకో,'' అన్నాడు బైసాని.

''నాకెందుకయా పక్కా షాపు. నీలాగా సరుకా, సరంజామా. ఈడ్చి తంతే ఆరు సైకిళ్లు లేవు. దీన్నిట్టా ఉండనిస్తే చాల్లే,'' అన్నాడు ఖాదరు.

"అయితే ఒక పని చేస్తా?" అన్నాడు బైసాని.

"ఏంది?" అన్నాడు ఖాదరు.

"ఇదిగో. ఈ రోడ్డుమీద నా చేతిలో ఎట్టా స్థల ముందో నీ చేతిలో కూడా అట్టాగే స్థలముంది. దాన్ని రెండు మూడు రకాలుగా ఉపయోగించుకోవాలి మనం. నువ్వు అద్దె సైకిళ్లనే నమ్ముకోక నా మాటిని సైడు బిజి నెస్సులు పెట్టు. పండ్లు ఫలహారాలు అమ్ము. ఏ సీజను లో వచ్చే కాయలు ఆ సీజన్లో అమ్ము. సోడాలు వేయిం చుకో. యింకేదైనా చెయ్యి. మీ సాయెబులకి సేద్యమా యవసాయమా యాపారమా కులవృత్తా. ఈ మార్జిను గాకుండా నీ ఎనక ఇంకేదైనా ఉందా ముల్లె?" అన్నాడు బైసాని.

ఖాదరుకు ఆ సలహా నచ్చింది.

ఆరోజు నుంచి అతడు సైడు బిజినెస్సులు మొదలుపెట్టాడు. ఏ సీజను కాయలు ఆ సీజనులో అమ్మడం బిగిను చేశాడు. ముఖ్యంగా ఎండాకాలంలో ఖాదరు అమ్మే కొబ్బరిబొండాలకీ చల్లటి సోడాలకీ మంచి గిరాకీ ఉండేది. మధ్యమధ్యలో పండగలప్పుడు అమ్మి పెట్టమని డ్యామేజీ గుడ్డలిచ్చేవాడు బైసాని. పెద్ద షాపుల్లో అడుగుపెట్టడానికి జంకే పల్లెటూరోళ్లు ఖాదరు దగ్గర ఆ డ్యామేజీ గుడ్డలని సలీసుకి కొనుక్కునే వాళ్లు. ఆదాయంలో పదికి రెండు ఖాదరుకి దక్కేది.

కొంతకాలం గడిచింది. ఖాదరు చేతిలో నాలుగు డబ్బులు ఆడడం చూసి బైసానికి యింకో ఐడియా వచ్చింది.

"ఖాదరనా. ఊర్లో రాత్రయితే అంగళ్లన్నీ మూసే స్తున్నారు. చుట్టా బీడీలకి జనం అల్లాడుతున్నారు. నువ్వు గనుక రాత్రి పొద్దుబోయాక చుట్టా బీడీ సిగరెట్టు టీలని ఐదు పది పైసలు ఎక్కువ లెక్కన అమ్మగలిగినా వంటే మంచి ఆదాయం వస్తుంది. ఎటొచ్చి నిద్ర కాయాల," అన్నాడు.

ఖాదరుకి ఆ మాట కూడా నచ్చింది.

"యింటికి పోయి చేసేదేముందబయా. అన్నం తినేసొచ్చి కూచుంటా," అన్నాడు.

ఆరోజు నుంచి ఖాదరు గంగరాయి చెట్టుకి లాంతరు వేలాడదీసి రాత్రిపూట యాపారం మొదలు పెట్టాడు. రాత్రి పదీ పదకొండు నుంచి మొదలయ్యి తెల్లవారు నాలుగు వరకు కొనసాగేదది. ఒకేసారి టీ కాచి ఫ్లాస్కుల్లో పోసుకొని కూర్చునేవాడు కాబట్టి పెద్ద బాదర బందీ ఉండేది కాదు. రాత్రిళ్లు తిరిగే జనాలు నెమ్మది నెమ్మదిగా ఖాదరు అంగడికి అలవాటుపడ్డారు. రోడ్డున పోయే లారీలు అక్కడ ఆగడం ప్రారంభించాయి. బీటు కానిస్టేబుళ్ల వంటికి ఖాదరు మాటలు, టీ బాగా పట్టాయి. రోజూ రాత్రిపూట ఆ గంగరాయి చెట్టు కింద ఎంత సందడిగా, కళగా ఉండేదంటే ఎప్పుడైనా నిద్ర పట్టకపోతే బైసాని వచ్చి కబుర్లు చెబుతూ కూర్చునేవాడు ఖాదరుతో.

అట్లా ఒకటి కాదు, రెండు కాదు... సుమారు ముప్ఫయి ఏళ్లు గడిచిపోయాయి. ఈ ముప్ఫయి ఏళ్ల పాటు పగలూ రాత్రీ ఖాదరు ఆ మార్జినులోనే, ఆ రోడ్డు వారనే, ఆ బెత్తెడు తోకతోనే జీవించాడు. అతడి కండలు కరిగిపోయాయి. ఎండలకి బధ్రంగా ఆముదం రాసి కాపాడుకుంటూ వచ్చిన చిక్కటి జుట్టు రాలిపోయింది. మనిషి తగ్గాడు. పలుచబడ్డాడు. కానీ నడుం వంగలేదు. ఒకడికి వంగబెట్టడం అతడికి చేతగాలేదు.

"అబయా, ఈ తావులో ఉండి నేను బాగు పడిందీ లేదు. పోగొట్టుకున్నదీ లేదు. కానీ ఒకరి దగ్గర దేహీ అనకుండా బండి లాక్కొస్తున్నాను చూడూ.... అది చాలు," అనేవాడు బైసానితో.

ఆ మాటలు వింటే బైసానికి ఎంతో కొంత సిగ్గుగా అనిపించేది. అతడికి ట్రంకు రోడ్డు మీద ఇంకా రెండు మూడు షాపులు సంపాదించాలనీ, కందుకూరులో ఒకటీ, వింజమూరులో ఒకటీ గుడ్డల అంగళ్లు పెట్టా లనీ బైసానోళ్ల పేరు ఊరూరునా కనిపించాలనీ వుండేది. కానీ అట్టాంటి యావే లేని ఖాదరుని చూస్తే ఒక్కోసారి ఈర్ష్యగా అనిపించేది.

ఇప్పుడు అదంతా గుర్తుకు వస్తుంటే దుక్కం ముంచుకొస్తోంది బైసానికి.

"మొన్న శనివారంరోజు ఖాదరొచ్చాడనా. మనిషి బెదురుగొడ్డులా కనిపించాడు. మిమ్మల్ని అడిగాడు. పని మీదెల్లారని చెప్పాను. ఆ తర్వాత మార్జినోళ్లతో కలిసి ఎటోపోయాడు. మళ్లీ రాలేదు," అన్నాడు చిన్న గుమాస్తా బైసానితో.

అప్పటికే బైసాని కుర్చీలోనుంచి లేచి అటూ ఇటూ పచార్లు మొదలుపెట్టాడు. ఖాదరు ఆచూకీ తెలుసుకొస్తానని పోయిన పెద్ద గుమాస్తా అరగంటైనా పత్తాలేడు. మాటిమాటికి రోడ్డు వైపే చూస్తున్నాడు బైసాని.

కాసేపటికి కాళ్లూపుకుంటూ పెద్ద గుమాస్తా వచ్చాడు.

"ఈ పక్క యాడా లేడనా. మున్సిపాల్టీ ఆఫీసు దగ్గర మార్జినోళ్లంతా టెంటేశారంట గదా, అడున్నాడేమో చూసేసొస్తా," అన్నాడు.

"వొద్దులే నేనే వెళతా. కాస్త కాలు సాగినట్టు వుంటుంది," అని బైసాని బయలుదేరాడు.

రోడ్డు మీద నడుస్తుంటే అంతా కొత్తగా ఖాళీగా ఉంది. ఎక్కడ చూసినా తగలబడి పోయినట్టుగా మొండిగోడలు. మొండి గుంజలు. దారి పొడుగునా అక్కడక్కడ బ్యానర్లు కట్టున్నారు చెట్లకి.

“మార్జినోళ్ల కడుపులు కొట్టకండి. మా మార్జిను మాకివ్వండి...” వంకరటింకర అక్షరాలు.

వాటిని చూసుకుంటూ ఒక చెట్టు దగ్గర ఆగిపోయాడు బైసాని.

అది గంగిరాయి చెట్టు. చాలాకాలంగా ఖాదరు తోపాటు తోడు పెరిగిన చెట్టు. ఇప్పుడు చిందరవందరగా పడున్న పాత టైర్ల మధ్యా, సొల్యూషన్ ట్యూబుల మధ్యా విరగిన రిమ్ముల మధ్య ఒంటరిగా నిలుచొని ఉంది.

ఒక్క నిమిషం అక్కడే నిలబడి తిరిగి బయలుదేరాడు బైసాని.

అతడికి వారంరోజుల క్రితం ఖాదరు కలిసిన సంగతి గుర్తుకొచ్చింది. ఆ సమయంలో వెలుగుతున్న అతడి ముఖం గుర్తుకొచ్చింది.

“ఇప్పుడే మార్జినోళ్లందరం వెళ్లి పెద్ద తలకాయల్ని కలిసొస్తున్నాం అబయా. అయా, యిట్టిట్ట సంగతి. ఎన్నాళ్లగానో ఈడ బతుకుతున్నాము. మీరు పొమ్మంటే పోయి కావలి చెరువులో దూకి సావడం కంటే వేరే దోవ లేదు మాకు. మీరు కూల్చేంత దుకాణాలు లేవు. పడగొట్టేంత పెద్ద మనుషులం కాము. కనికరించండి తండ్రులారా అని కాళ్లూ గడ్డాలూ పట్టుకొని బతిమిలాడుకుంటే- అయ్యో మీ జోలికి వస్తామని ఎవరు చెప్పారు. ఇప్పుడే మీ సంగతి చూస్తామని ఎవరు కూశారు. పై నుంచి మాకొచ్చిన ఆర్డర్లన్నీ పక్కాషాపుల గురించే. ముందు కత వాళ్లదే. మీరేమీ బయాలు పెట్టుకోబాకండి. ఒకేల కావాల్సొస్తే డబుల్ రోడ్డు వేసే నాటికి చూసుకుందాం. అప్పటికి కూడా మీ మార్జిను యాడికీ పోదు మేము చూసుకుంటాం పోండి అన్నారబయా. కూతురు కాన్పుకొచ్చేట్టుంది ఈ సీజనులో డ్యామేజీ గుడ్డలు దండిగా అమ్ముకుందాం అనుకుంటూ ఉండే ఇదేందిరా అని హడలిచచ్చా. ఇప్పుడు మనసు కుదుటపడింది,” అన్నాడు నిమ్మళంగా.

అంతే అయ్యుండొచ్చులే అనుకున్నాడు బైసాని.

ఒకటా రెండా- ఊర్లో కాకుల కంటే ఎక్కువ, కదిలిస్తే గోల పుట్టి బూకంపాలు రాబోవా అనుకున్నాడు.

అయితే అట్టాంటిదేమీ జరగలేదని అతడికి అర్థమైపోయింది. బూకంపాలు కాదుగదా, ఆకు తెగి నేలమీద పడేంత తాకిడి కూడా ఎదురుకోకుండా పని ముగించేసినట్టున్నారు అనుకుంటూ మున్సిపాల్టీ ఆఫీసు దగ్గరకు చేరుకున్నాడు.

అక్కడంతా అడావిడిగా ఉంది. యాడాడి మార్జినోళ్లంతా అక్కణ్ణే చేరిపోయి ఉన్నారు. మాటలు జోరుగా ఉన్నాయి. మధ్యమధ్యలో కేకలు అరుపులుగా ఉన్నాయి. కొందరు లోపలికీ బయటికీ తిరుగుతున్నారు.

టెంటు లోపలికి ఆత్రంగా వెతికాడు బైసాని. తెలిసిన ముఖాలన్నీ కనిపిస్తున్నాయి.

పరోటా షేర్వా అమ్మే పాఛులు, దూదేకుల లాలప్ప, అరటికాయలమ్మే వడ్డోళ్ల కోటేశ్వరమ్మ, బంకు సుబ్బారెడ్డి, పటాలకి ఫ్రేములు కట్టే సూరి, వెంకటేశ్వర హాలు దగ్గరి మంగలోళ్లు, కుమ్మరి సీతయ్య, తమలపాకులు అమ్మే నల్ల షరీపు, పెట్రమాక్స్ లైట్లు అద్దెకిచ్చే అహమదు, కార్పెంటర్లు, వాచి రిపేరర్లు, దర్జీలు, కరెంటు పనోళ్లు... ఖాదరు మాత్రం లేడు.

బైసాని ఎవరిని వెతుకుతున్నాడో తెలియక టెంట్లో ఉన్న పాఛులు బయటికొచ్చాడు అడుగుదామని.

“ఏం శెట్టిగారో ఎట్టెట్ట ఉన్నామో చూసిపోదామని వచ్చారా?” అన్నాడు అక్కసుగా.

“అదేంది పాఛుమియా,” అన్నాడు బైసాని ఆ మాటకి.

“లేకుంటే ఏంది సామి. మీ వీపుల మీద బాదడానికి మా కడుపుల మీద గుద్దితిరి. మీవి కూలుస్తామంటే కూల్చనీయొచ్చుగా... ఆట్... మేమేనా ఆక్రమించుకుంది మార్జినోళ్లు ఆక్రమించుకోలేదా అని లా పాయింట్లు తీస్తిరి. సరే మేకపోతుల్ని ఎయ్యాల్నే దున్నపోతులు మాటినేట్లు లేవని మమ్మల్ని ఏసేశారు,” అన్నాడు పాఛులు.

“అట్ట మాట్లాడబాక పాఛులు. మాకు ఎంత నష్టం వచ్చిందో తెలుసునా. కోటి రూపాయల పైన్నే అంటున్నారు. నాకొక్కడికే మూడు లక్షలు నష్టం,” అన్నాడు బైసాని.

“అయ్యా, మీ అందరికీ కోటి రూపాయలంటే వెంటికముక్క. కానీ మాకు వెయ్యి రూపాయలన్నా గనమే. టెంటేద్దాం రండి అనంటే పాలోమని వచ్చిపడ్డారందరూ. ఈ వేళకి ఒక్కరు ఇడ్లీముక్క నోట్లో పెట్టుకోలా. డబ్బులేడివి. ఏరోజుకారోజు తెచ్చుకుని తినే మాబోటి జనానికి తావు లాకుండా జేస్తిరి. ఇంట్లో కూర్చుని తిన్నా చెల్లుబాటయ్యే మీబోటోళ్లు మాత్రం దిట్టంగా వున్నారు,” అన్నాడు పాఛులు.

“ఖాదరు లేడా,” అన్నాడు బైసాని, ఇంక మాటలెందుకని.

“ఖాదరు రాలా. నిన్న కనిపించాడు. ఆ తర్వాత ఎటుపోయాడో ఎవణ్ణి ఎవడు పట్టించుకుంటాడు. ఎవడిది వాడు గోక్కోవడమే సరిపాయా,” అన్నాడు పాఛులు.

''ఇంటికెళ్లి పలకరించి వద్దాం వస్తావా. మధ్యాహ్నం స్కూటరు తెస్తాను,'' అన్నాడు బైసాని.

''నాకు కుదర్దు. మా ఇంటిది సింగరాయకొండ పోయి అక్కడ అంగడి పెట్టుకుందాం అని అంటోంది. ఒకసారి సింగరాయకొండ పోయి రావాలి,'' అన్నాడు పాఘులు.

ఈలోపల లాలప్ప వచ్చాడు.

''మా యింటామె కూడా అల్లూరో, రాజుపాలెమో వెళ్లిపోదాం అంటోంది. ఇన్నాళ్లు బతికిన ఊరు. యాడబోతాం,'' అని నెత్తి గీరుకున్నాడు.

దానికి బంకు సుబ్బారెడ్డి అందుకున్నాడు.

''అయ్యా. నువ్వు అల్లూరుపో, రాజుపాలెం పో, హైదరాబాదు పో, అండమానుపో. అంతా ఇదే పరిస్థితి. రోడ్లు వెడల్పు చేయాలనీ వరల్డుబ్యాంకు అప్పిచ్చిందనీ యాడికాడ లేపవతల పారేస్తున్నారు. మొన్నటికి మొన్న తిరుపతి నుంచి ఒక తెలిసినాయన వచ్చాడు. అక్కడ మార్జినోళ్లని కట్టెలు తీసుకొని తరుముకున్నారంట. నువ్వు రాజుపాలెం పోయినా అల్లూరుపోయినా అక్కడ కూడా అట్టే తరుముకోరని గ్యారంటీ ఏంది? కాబట్టి మనం మన ఊర్లోనే ఉండి- మనల్ని ఖాళీ చేయించిన వాళ్ల చొక్కాలు పట్టుకొని- ఒరే బేటే నా కొడకల్లారా, మేము ఈ ఊర్లో పుట్టాము ఈ ఊర్లో పెరిగాము, మీరేమో ఈడ ఫ్యాక్టరీలు తెరవకపోతిరి, కార్ఖానాలు పెట్టకపోతిరి, చదివినా చదవకపోయినా ట్రంకురోడ్డు కొచ్చి కిళ్లీ బంకు పెట్టుకునేదానికి తప్ప ఇంక దేనికీ పనికిరాకుండా జేస్తిరి, సరే పోనీలేగదా మా దోవన మేము బతుకుతూ ఉంటే ఖాళీ చేయిస్తాం ఖాళీ చేయిస్తాం అని బెదిరిస్తూ ఉండిరి, ఆఖరికి ఖాళీ చేయిస్తిరి. మా ఊర్లో పోయే రోడ్డు మాది గాకుండా ఇంకెవరిదవుతుందిరా బోసడీకేల్లారా. మర్యాదగా మా మార్జిను మాకిస్తారా లేకుంటే రోడ్డు తవ్వి పాతరెయ్య మంటారా అని అడిగామనుకో. అప్పుడు దారికొస్తారు,'' అన్నాడు సుబ్బారెడ్డి.

''అదంత సులబం కాదులే సుబ్బారెడ్డా,'' అన్నాడు లాలప్ప.

''సులబం కాదనుకోవడం వల్లే ఇదంతా. చూస్తా చూస్తా, నా మార్జిను నాకిచ్చారా సరేసరి. లేకుంటే ఏ పోలీసోడిదో పార్టీవోడిదో మెడ గట్టిగా జవురుకొని ఎండ్రిన్ తాగేస్తా. ఎవరొచ్చి విడిపించినా విడవను. ఇంకాస్త గట్టిగా బిగిస్తా. నేను చస్తా. వాడు బతికే వుంటాడు. నాతోపాటు అట్టే పాతేయాలి కొడుకుని,'' అన్నాడు పల్చటి నీటిపొరతో కళ్లు ఎర్రబడుతుంటే.

సుబ్బారెడ్డి వాలకం చూస్తే అన్నంత పనీ చేసేలా కనిపించాడు బైసానికి.

''అంతంత పెద్ద మాటలెందుకులేవయ్యా. నీ మార్జిను నీకివ్వకుండా యాడికి పోతారు,'' అన్నాడు బైసాని.

''ఏంది ఇచ్చేది?'' అన్నాడు పాఘులు.

''లోపల మాటలు జరుగుతున్నాయి పోయి వినిరాపో. ఇంకో ఆర్నెల్లకో సంవత్సరానికో డబుల్ రోడ్డు వేస్తారంట. వేశాక రెండడుగులో మూడడుగులో లెక్క గట్టి సిమెంటు మార్జిను వేస్తారంట. ఆనేక దాని మీద సన్నసన్నటి బంకులేస్తారంట. వాటిని నలబై వేలో యాబై వేలో అడ్వాన్సు కట్టి అద్దెకి తీసుకోవాలంట. ఇయన్నీ జరిగేపాటికి మేమూ మా బిడ్డలం ఠారున సచ్చేపోయుంటాం. ఒకేల బతికున్నా- ఇప్పుడు గట్టిగా అడిగితే నాలుగు వేలు తేలేంగానీ అప్పుడు నలబైవేలు యాబై వేలు తేవడం మా వల్ల అయ్యే పనేనా. అప్పుడు ఏం జరుగుతుందయ్యా అంటే, మీబోటి శెట్టిగార్లు డబ్బున్న పెద్దోళ్లు బినామీ పేర్లతో వాటిని అద్దెకు తీసు కుంటారు. మేము గుడుసుకొని పోతాం,'' అన్నాడు పాఘులు, బైసానిని మళ్లీ ఒదలకుండా.

''స్వామీ నీనోటికి నేను పడలేను. నేను పోతున్నా. ఖాదర్‌గానీ వస్తే వెంటనే మా అంగడికి దగ్గరకు రమ్మను,'' అన్నాడు.

''ఏంది వచ్చేది. నిన్న జరిగిన దానికి ముఖం చెల్లుండదు ముసలోడికి. నాలుగు రోజులు పోయాక నెమ్మదిగా వస్తాడులే,'' అన్నాడు పాఘులు.

''అంతేనంటావా?'' అన్నాడు బైసాని.

''అంతేగాక,'' అన్నాడు పాఘులు.

అయినాగానీ వీలైతే ఆ సాయంత్రమే ఖాదరుని కలవాలని అనుకున్నాడు బైసాని.

కానీ ఆ మాట నెరవేర్చుకునేందుకు అతడికి వీలులేకపోయింది. అదేరోజు మధ్యాహ్నమే బేల్దారు ఎంకయ్య రావడం, సిమెంటు, ఇసుకా తోలించడం, ఆ రాత్రే పని మొదలెట్టడంతో దగ్గరుండి చేయించు కోవాల్సిన పనికావడం మూలాన నాలుగురోజుల పాటు తీరికే చిక్కలేదు. మధ్యమధ్యలో మార్జినోళ్లు కనిపిస్తు న్నారు, కలక్టరు వస్తే వెళ్లి కలుస్తున్నారు, పని అవు తుందా కాదా అని మల్లగుల్లాలు పడుతున్నారుగానీ ఖాదరు మాత్రం అతడి కంటికి కానరాలేదు. ఎవర్ని అడిగినా మాకు తెలియదు మాకు తెలియదు అనడమే.

ఇన్ని రోజుల పాటు ఖాదరు ఏనాడూ ఇంట్లో కూచుని ఎరుగడు. ఒకేళ జొరంగానీ తగిలిందా, డబ్బు ల్లేక అవస్తలు పడుతున్నాడా అని అనుమానం వచ్చిం దతనికి. మరుసటిరోజు పొద్దున ఎట్టాగయినా సరే ఖాదరు ఇంటికి వెళ్లాలి అని అనుకుంటుండగా ఆరోజు

సాయంత్రం- బాగా పొద్దుపోయాక- ఎవరో మార్జినోడు ఆత్మహత్య చేసుకొని చచ్చిపోయాడన్న వార్త ట్రంకు రోడ్డు మీద గుప్పుమంది. క్షణాల్లో మార్జినోళ్లు పోగై పోయారు. ఎవడు పోయాడు, ఎవడు పోయాడు అను కుంటూ ఉరుకుల పరుగుల మీద వివరాలకు వెతు క్కుంటున్నారు.

బైసాని గుండెలు జావగారిపోయాయి. దేవుడా ఖాదరు కాదుగదా అని దిక్కులు చూస్తూ ఉండేసరికి- చనిపోయింది ఖాదరు కాదనీ, గోతంపట్టల యాపారం చేసే పెంచలయ్య అనీ, అది కూడా ఆత్మహత్య కాదనీ, పెంచలయ్యకు చాలాకాలంగా ఒళ్లు బాగుండక పోవడం వల్ల ఇప్పుడిలా ఖాళీ చేయించేసరికి మనో వ్యధకి జబ్బు తిరగబెట్టి పోయాడనీ వార్త అందింది.

అయినప్పటికీ సెంటర్లో మార్జినోళ్లు బాగా వేడెక్కి పోయారు. ఇంత పొడుగు తిట్లతో కడుపుమంట చల్లార్చుకుంటున్నారు.

పాఛులైతే ఫుల్లుగా తాగేసొచ్చి పొట్టి శ్రీరాములు బొమ్మ దగ్గర వీరంగాలు తొక్కాడు.

“పెంచలయ్య చావలేదు. మునిసిపాల్టీవాళ్లే చంపేశారు. గవర్నమెంటోళ్లే లేపేశారు. చూస్తూ వుండండి. యింకా ఎంతమంది చస్తారో. ఎంతమందిని చంపేస్తారో,” అని అంటూ అంటూనే- కైపు వల్లో నిజం గా దుక్కమేసో పక్కనే ఉన్న బంకు సుబ్బారెడ్డిని పట్టు కొని, “సుబ్బారెడ్డా... నేను కూడా సచ్చిపోతా సుబ్బారెడ్డా. బిడ్డలకి అన్నం పెట్టలేని బతుకు బతకలేను సుబ్బా రెడ్డా,” అని భోరున ఏడ్వడం మొదలుపెట్టాడు.

ఆ ఏడుపు చూసి, అక్కడున్న మార్జినోళ్ల ముఖాలు చూసి బైసానికి కాలూ చేయీ ఆడలేదు.

ఎప్పుడెప్పుడు తెల్లారద్దా, ఎప్పుడు ఖాదర్‌ని కలు ద్దామా అని జాగారం చేశాడతడు.

బైసానికి ఊహ తెలిశాక, అంటే చాలా ఏళ్ల క్రితం కావలికి పెద్ద తుఫాను కొట్టింది. అది గవర్నమెంటు తెచ్చిన తుఫాను కాదు. సముద్రంమీద నుంచి వచ్చిందే. అప్పుడు కూడా ఇలాగే చాలా ఇళ్లూ వాకిళ్లూ కూలి పోయాయి. దరిద్రులు గతిలేని వాళ్లయ్యారు. పోయింది ఇళ్లే గాబట్టి ఎక్కడ స్థలం ఇచ్చినా పోతారు కాబట్టి అట్టాంటి వాళ్లందరికోసం, ఊరికి పడమటివైపు, దూరంగా ఉండే గుట్ట మీద ఇళ్ల స్థలాలు ఇచ్చారు. దానికి తుఫాన్‌నగర్ అని పేరు పెట్టారు. అక్కడ కొందరు పట్టాలు తెచ్చుకొని గుడిసెలేసుకున్నారు. కొందరు పట్టాలు లేకపోయినా గుడిసెలేసుకున్నారు. అట్టా పట్టాలు లేకుండా గుడిసెలేసుకున్న వాళ్లల్లో ఖాదరు ఒకడు.

“ఎమ్మార్వో దగ్గర అర్జీ పెట్టుకొని పట్టా తెచ్చుకో ఖాదరనా. లేకుంటే ఎప్పటికైనా గొడవే,” అనేవాడు బైసాని.

ఖాదరు వినేవాడు కాదు.

”ఈ మాత్రం సంబడానికి అర్జీలు, పట్టాలు దేనికి సుబ్బయ్యా. ఈ గుట్టల్లో గుడిసెని ఎవడు తన్నుకు పోతాడు?“ అనేవాడు ఎంతో నమ్మకంగా.

ఏ విధంగా అయితే ముప్పయి ఏళ్లుగా రోడ్డు మీదున్న ఆ మార్జిన్‌ను తనదే అని జీవించాడో అదే విధంగా తుఫాన్‌నగర్‌లోని ఆ ఇంటిస్థలం కూడా తనదే అనుకుంటూ జీవించాడు.

ఇప్పుడా నమ్మకం ఉండుంటుందా అను కున్నాడు బైసాని.

పట్టాలు ఉన్నా, పట్టాలు లేకపోయినా- కోర్టులు ఉన్నా కోర్టులు లేకపోయినా- తన బోటోళ్ల దగ్గర డబ్బున్నా ఖాదరుబోటోళ్ల దగ్గర లేకపోయినా- పెద్దోళ్లు తల్చుకుంటే ఎవర్ని ఎక్కణ్ణుంచైనా తరిమి కొట్టొచ్చు, దేన్ని ఎక్కణ్ణుంచైనా కూలగొట్టొచ్చు. ఎవర్ని ఏ విధంగానైనా ఏమార్చవచ్చనే కాలం బూమండలాన వచ్చేసిందని తనలాంటోడికే బయమేస్తుంటే ఖాదరు లాంటోడికి వేయకుండా ఉండదా? అనుకుంటూ ఖాదరు యింటి ముందు స్కూటరాపాడు.

ఇంటికి తాళం వేసి ఉంది. వసారాలో నాలుగైదు సైకిళ్లు అక్కరలేనట్టుగా పడున్నాయి. వాకిలి ముందు కసువు పేరుకొని ఉంది.

ఎటు పోయుంటాడు అని చుట్టూ చూస్తూ వుంటే, “ఎవురా?” అంది పక్కింటామె బైసాని వెంకట సుబ్బయ్యని చూసి.

“ఖాదరు లేడా అమ్మా. నా పేరు బైసాని వెంకట సుబ్బయ్య,” అన్నాడు స్కూటరు దిగుతూ.

“యింకెక్కడి ఖాదరు నాయనా. ఆరోజే పాయనే. దా. కూసో,” అని వీధిలో నులక మంచం పరిచిందామె.

“యాడికి పోయుంటాడమ్మా. కూతురి దగ్గరకు పోయుంటాడా?” అన్నాడు ఆలోచనగా.

“కూతురేంది నాయనా. ఆ అమ్మి నిన్నగాక మొన్నొచ్చి లబలబమని నెత్తి కొట్టుకొనిపోయే. ఆ మనిషి వాళ్లూరు పోతేగదా. ఫలానా చోటుకి పోతున్నట్టు చెప్తే కదా. పెళ్లాం చేయి పట్టుకొని అదేపోతా.”

బైసాని మనసులో అనుమానం పడింది.

“ఏం నాయనా మీకేమైనా అప్పు పడున్నాడా?” అందామె.

“ఛఛ అది కాదమ్మా. ఆయన నాకు దగ్గరగా తెలుసు,” అన్నాడు బైసాని.

"చూడబోతే మీరు శెట్లులాగున్నారు. ఎవరైతే ఏంది నాయనా అందరం నాశనమైపోయాం. మా ఇంటాయన ఆర్టీసీ బస్టాండు దగ్గర మిషను పెట్టుకొని మోటారుసైకిళ్ల సీట్లు కుట్టేవాడు. ఇవాళ తరిమి పారేశాక ఇక్కడ ఇంట్లో మిషను పెట్టి అక్కడికి పోయి పొద్దు న్నుంచి సాయంత్రందాకా ఎండల్లో నిలబడుకొని వుంటున్నాడు. ఖాతాలు గదా నాయనా. ఎలా ఒదులు కోవడం. ఆర్డర్లన్నీ ఒకేసారి తెచ్చుకొని రాత్రిళ్లు ఇంటికాడ కుడుతున్నాడు. ఇట్టా ఒకరోజు, రెండ్రోజులంటే గడు స్తుందిగానీ, ఎల్లకాలం గడుస్తుందా. చస్తే ఆరడుగుల నేల ఇవ్వడానికి తయారుగా ఉన్నారుగానీ బతుకుతాం నాలుగడుగుల నేలివ్వండి అనంటే కుదరదంటున్నారు గదా. మా పీనుగుల్ని కాల్చి పాయసాలు కాస్తామంటు న్నారే ఆ తీపి ఎవరికోసమో చెప్పరాదా? ఇంకా ఈ లోకాన మాబోటోళ్లకు నూకలు చెల్లిపోయినట్టే నాయనా. మీబోటోళ్లు బతకాల్సిందే ఉసురుపోసుకొని," అందామె విచారంగా.

బైసానికి మనసు చివుక్కుమంది.

"ఎవరి ఉసురు ఎవరు పోసుకోవాలమ్మా. మీ అంగళ్లన్నీ లేపేస్తే మాకేమైనా లాబమా. మీరుంటే మాకే మైనా అడ్డమా. చిల్లర ఉంటేనే తల్లా రూపాయిల విలువ. మీరూ ఉండాలి. మేమూ ఉండాలి. అప్పుడే తాలూ మేలుగా యాపారం సాగుతుంది. చూడమ్మా మీకు సైకిళ్లున్నాయి. నాకు స్కూటరుంది. నెల్లూరు పోవడానికి ఆర్టీసీ బస్సులున్నాయి. మనం తిరగడానికి ఈ రోడ్డు చాలదా. దీన్ని ఇంత లావున ఇంత వెడల్పున సిద్ధం చేస్తున్నారంటే గవర్నమెంటు బాధలు ఏము న్నాయో మనకేమి తెలుసు. వాళ్లని పై నుంచి ఎవరు పొడుస్తున్నారో మనకేమి ఎరుక. ఉసురు ఉసురు అని మీరంతా అనుకుంటున్నారే అట్టా ఊర్లోకి పోయి చూడండి. మీరంతా ఏమైపోయారన్న ఆలోచన ఒక్క నిమిషమన్నా లేకుండా అబ్బ రోడ్లు బలే విశాలమ య్యాయి గవర్నమెంటోళ్లు బలే మంచిపని చేశారు అని అనుకునేవాళ్లు ఎంతమంది ఉన్నారో. దానికేంటావు," అన్నాడు గట్టిగా.

బైసాని కోపం చూసి, "అంతేలే నాయనా. కరెక్టు మాటన్నావు," అందామె మెత్తగా.

వాళ్ల మాటలకు వీధి చివర గుడిసెలో నుంచి ఒంటి మీద చొక్కా లేకుండా సలీంగాడు బయటికి వచ్చాడు.

బైసానిని చూసి, "సలామనా," అన్నాడు నవ్వుతూ.

"ఏమిరో సలీంగా. మీ యిల్లు కూడా యీడేనా," అన్నాడు బైసాని కూడా పలకరింపు నవ్వుతో.

సలీంగాడు బైసానికి బాగా తెలుసు. వాడు కూడా ట్రంకురోడ్డు మీద మార్జినోడేగానీ కచ్చితంగా మార్జినో డనడానికి వీలులేదు. నాలుగుచక్రాలతో తోపుడు బండి మీద పంచాంగాలు, క్యాలెండర్లు, ఘంటసాల పాటల పుస్తకాలు, సినిమా స్టయిల్ మంగళారతులు, రేజర్లు, తాళం కప్పలు పెట్టుకొని తిరుగుతుంటాడు. వాడి డిమాండ్ అంతా పల్లెటూరోళ్ల దగ్గరే.

కావలిలో కూలగొట్టడాల వల్ల ఎవరైనా నష్ట పోలేదు అంటే అది యిట్టాంటి తోపుడు బండోళ్లే.

"నీకేమిరా గాడు. బజారులో కనిపించడంలేదే," అన్నాడు బైసాని.

"యాడ కనిపిస్తాం అనా. పోలీసోళ్లు టైమింగ్సు పెట్టనే," అన్నాడు సలీంగాడు.

"అదేందిరో," అన్నాడు బైసాని.

"నీకు తెలియదా. డిఎస్పీయో ఇంకే పుణ్యా త్ముడో చెప్పాడంటా మార్జినోళ్లు పోయాక ఇంక అడ్డం గున్నది తోపుడు బండోళ్లేననీ వాళ్లని కూడా రోడ్డుమీద తిరగనివ్వొద్దనీ. దాంతో మమ్మల్ని బతకనివ్వనిది అటుంచు, బుట్టల్లో బత్తాయికాయలు అమ్ముకునే ఆడోళ్లని, కరెంటు స్తంభం కింద చెప్పులు కుట్టుకునే మాదిగోళ్లని కూడా బతకనివ్వటంలేదు. పొద్దన ట్రాఫిక్కు అడ్డమంట. మద్యాన్నం అన్నాల వేళకు కావా లంటే తిప్పుకోమంటున్నారు. అప్పుడు పల్లెటూరోళ్లం దరూ మ్యాట్నీల్లో ఉంటారు. నాకేం బేరం జరుగు తుంది," అన్నాడు సలీంగాడు.

ఒక నిమిషం ఆగి, "మీ గుడ్డల యాపారం అంటే ఏముందనా దాచిపెడితే పాసిపోయే రకం కాదుగదా. ఇవాళ కాకుంటే రేపైనా అమ్ముకుంటారు. నా సంగతి చూద్దూగానీ రా. జనవరి ఒకటి వస్తోందిగదా అని రాజ మండ్రి నుంచి ఎన్ని క్యాలెండర్లు, ఎన్ని పంచాంగాలు తెప్పించి కుప్పబోశానో. ఇప్పుడు రోడ్డుమీద తిరగనీయక పోతే ఎట్టా అమ్ముకునేది? పచ్చి సరుకు. డేటు దాటేస్తే పొయ్యిలోకి కూడా పనికిరాదే," అన్నాడు బాధగా.

సలీంగాడి లాంటోడి పెట్టుబడి మొత్తం కలిపితే రెండు మూడు వేలు ఉండదు. కానీ ఆ అప్పు చాలు కాలరాయడానికి.

"నువ్వు గమనించలేదా అనా. ఇప్పుడు ఊర్లో వున్న పోలీసోళ్లందరూ కొత్తోళ్లే. పాతోళ్లంటే పరిచయా లుండేవి. చూసీ చూడనట్టు పోయేవాళ్లు. వాళ్లకి ముందే ట్రాన్స్‌ఫర్లు అయ్యాయో, లేక ఈ టైములో కావాలని కొత్తోళ్లని తీసుకొచ్చారోగానీ సంపక తింటున్నారు. బండి కదిలితే ఆపుతారు. ఆపితే కదలమంటారు. అట్టా గదా నా కొడుకులు మదమెక్కి ఖాదరన్నని కొట్టింది," అన్నాడు.

బైసాని ఒళ్లు ఝల్లుమంది.

"ఏంది ఏంది," అన్నాడు గాబరాగా.

"అయ్యో... నీకు తెలియదా. కుమ్మారుగదా సామీ ఖాదరన్నని. ఆదివారం రోజు మార్జినోళ్ల మీద పడినారు గదా. నువ్వున్నావా లేవా? ఏమోలేగానీ ఆరోజు పిచ్చికుక్కలు మీద పడినట్టు మార్జినోళ్ల మీద పడితిరి. ఎవడికి వాడు సర్దుకొని బతుకుజీవుడా అని పరిగెడు తున్నారుగానీ ఖాదరన్న కదిలితేగదా. ఏం అనా. కదలవా అంటే వింటేగా. రాయిలాగా నిలబడిపోయాడు మనిషి. తడికెలు విప్పబోతే వద్దంటాడు. సైకిళ్లు తీయబోతే చేయి పట్టుకుంటాడు. చూపులు మనల్ని చూస్తు న్నాయో, ఇంకెవర్నయినా చూస్తున్నాయో అర్థంగాదు. పిచ్చెక్కద్దేమోనని బయమేసి పాషులన్ననో, షరీఫునో కేకేస్తే యాడ. ఎవడి రావందాడిలో వాళ్లున్నారు. పోలీ సోళ్లొచ్చారు, మున్సిపాల్టీవోళ్లు వచ్చారు. చెప్పారు. అది లించారు. బెదిరించారు. అంగడి తీయమని పట్టుకొని తోశారు. ఖాదరన్న వింటేగదా. దండాలు పెడతాడు. కాళ్లూ గడ్డాలు పట్టుకొని బతిమిలాడతాడు. అంత పెద్ద మనిషి, వయసు మళ్లినోడుగదా పసిపిల్లాడిలాగా ఏడుస్తాడు. నేనెక్కడికి పోయేది ఎక్కడికి పోయేది అని కలవరిస్తా చెట్టు మానుని కరుచుకొని పెనుగులాడ తాడు. వాళ్లు చూసీచూసీ ఇంకిట్టగాదని తడికెలు, సైకిళ్లు, టీ దబర్లు, ఫ్లాస్కులు అన్నీ కట్టగట్టి లారీలో వేసి స్టేషనుకి పంపించారు. సరుకు స్టేషనుకు పోతే ఇంకేమైనా ఉందా? నేను గబగబా ముఖాన నీళ్లు జల్లి, మనిషిని స్వాధీనంలోకి తెచ్చి- అనా. నీకు దండం పెడతా అనా. అట్ట బెదిరిపోబాక. మనబోటోళ్లకి మానా బిమానాలు ఏల? ఊపిరుంటే యాడైనా బతకొచ్చు. ఇది గాకుంటే యింకొకటి. ముందు నీ సామాను నువ్వు తెచ్చుకో. దా అనా అనేసరికి పిచ్చోడ్లా స్టేషనుకు పరి గెత్తాడు. అక్కడ ఖాదరు సామాన్లు తెచ్చినవి తెచ్చినట్టే ఉన్నాయి. రెండు సైకిళ్లు మాత్రం లేవు. అవి కొత్తవి...

"ఆ సంగతి గ్రహించాక నాయనా... ఏమి చెప్పను ఖాదరన్న బాద. నా సైకిళ్లు... నా సైకిళ్లు అని పొర్లకింతలు పెట్టాడు నేలమీద. ఎవడు చెప్తాడు సమా దానం? ఇన్నే తెచ్చామని ఒకరు, ఇన్నే ఉన్నాయని ఒకరు, ఎవరు తీసుకెళ్లారో అని ఒకరు, మాకేం తెలియదని యింకొకరు... మొత్తం మీద నూకేశారు వాటిని.

"అసలే అంగడిపోయి జీవంపోయిందా మనిషికి. యిప్పుడు సైకిళ్లు పోయాయని తెలిశాక ప్రాణం పోయే ట్టుగా తయారయ్యాడు. ఎట్టా పోయే ప్రాణం పోతానే ఉందిగదా అనుకున్నాడో ఏమో, తడికెలోని బొంగులాగి 'నా కొడకల్లారా, ఇస్తారా, మీ గోరీలు కట్టమంటారా,' అన్నాడు ఉగ్రంగా.

"పోలీసోళ్లకి పౌరుషం పొడుచుకొచ్చేసింది. 'ఏందిరా నువ్వు కట్టేది,' అని ఒకడు గూడ మీద దన్ మని బాదాడు. ఇంకొకడు మూతిమీద పెటేలున పొడిచాడు.

అట్టే రక్తం కారిపోయింది. "పో నాకొడకా. ఎవరితో చెప్పుకుంటావో చెప్పుకో పో," అన్నారు.

ఇంక చప్పుడు చేయలేదు ఖాదరన్న. బొమ్మ లాగా అట్టే నిలబడిపోయాడు. ఆ వాలకం చూసి ఆయన్నీ ఆయన సరంజామానీ నేనే రిక్షాల్లో వేసుకొని తీసుకొచ్చా. ఆ రాత్రంతా ఆ మాటలు ఈ మాటలతో మా ఇంట్లో మేల్కొనే ఉన్నాం. కానీ ఖాదరన్న ఒక్కసారి కూడా బైటికి తొంగిచూడలా. తెల్లవారి చీకటితో నేను బైటికెళ్లి వస్తుంటే మొగుడూ పెళ్లాలు పోతూ కనిపిం చారు. యాడికనా యాడికనా అని వెంటబడి అడిగినా చెప్తే కదా. రక్తం కారిన చొక్కాతో అట్టే పోయే మనిషి..." అని ఆగాడు సలీంగాడు.

ఇది జరిగి ఐదు నెలలు కావస్తోంది. ఇవాల్టి వరకు ఖాదరు ఆచూకీ తెలియలేదు.

అతడు నాగూరు ఖాదరువలీ దర్గాకు వెళ్లి పోయాడనీ, కాదు ఆత్మహత్య చేసుకొని చనిపోయాడనీ, ఇంకెక్కడో బంకు పెట్టుకున్నాడనీ, హోటల్లో సర్వరుగా పనిచేస్తున్నాడనీ రకరకాల పుకార్లు వినిపిస్తూ ఉన్నాయి.

కానీ బైసాని దేన్నీ నమ్మలేదు. ఖాదరు తిరిగొస్తా డనీ లేకుంటే వెతికి పట్టుకోవచ్చని వీలైనప్పుడల్లా ఆరా తీస్తూనే ఉన్నాడు. కొత్తల్లో ఈ పని చురుగ్గా చేశాడు. ఆ తర్వాత సొంత గొడవల్లో యాపారంలో పడి ఆ సంగతి వదిలేశాడు.

ఈమధ్య దూరపుచుట్టం ఒకాయన వచ్చి, "అబ్బ. ఈ తడికెల బుడికెల అంగళ్లన్నీ అడ్డంపోయాక మీ పెద్దంగళ్లు చాలా బాగా కనిపిస్తన్నాయయ్యా యాపారానికి," అనంటే- అవునా అని సంతోషంగా ముఖం పెట్టాడంట బైసాని.

అయితే ఆ దూరపు చుట్టం అంతటితో ఊరు కోక, "నీ సంబడం కూడా ఎంతకాలంలే? మీకు పోటీగా రేపు చైనా సరుకో, జపాన్ సరుకో దిగితే నువ్వు కూడా ఉండవు ఈడ," అనుకుంటూ పోయాడంట.

రాబోయే కాలాల్లో, ఆరాటాల్లో బైసాని మనసు లో కూడా ఖాదరు మిగిలేట్టు లేడు.

*పర్‌స్పెక్టివ్స్ ప్రచురించిన 'ఖాదర్ లేడు', మే 2001*